ప్రజల చేతిలో
www.ayudamdaily.com
# ఆయుధం
The Common People's Voice
శనివారం | జూన్ 13, 2026 | సంపుటి : 7 | సంచిక : 14 | పేజీలు : 2

## ప్రజాపాలనలో గ్రామాల అభివృద్ధి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి




# బీజేపీ కార్యకర్తలా రిటర్నింగ్ ఆఫీసర్

- ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌ను బీజేపీ ఆదర్శంగా తీసుకుంది
- శాంతిభద్రతల సమస్యతోనే పవన్ సభకు అనుమతివ్వలేదు
- ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్ చిట్ చాట్

**ఢిల్లీ, ఆయుధం:** తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ వ్యవహారంలో రిటర్నింగ్ అధికారి (ఆర్వో) బీజేపీ కార్యకర్తలా వ్యవహరించారని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌ను భాజపా ఆదర్శంగా తీసుకుందని.. ఆ పార్టీ నేతలు ఆయనలా ప్రవర్తిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఉత్తర కొరియాలోనూ ఎన్నికలు జరుగుతాయని, ఫలితాలు మాత్రం అధ్యక్షుడు చెప్పిన విధంగా వస్తాయన్నారు. దిల్లీలో మీడియాతో చిట్ చాట్‌లో రేవంత్ మాట్లాడారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై ఆయన విమర్శలు చేశారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సభకు హైదరాబాద్‌లో అనుమతి నిరాకరించిన అంశంపైనా సీఎం స్పందించారు.

### కేటీఆర్ చెప్పినట్లు కిషన్‌రెడ్డి డ్రామా

“మధ్యప్రదేశ్‌లో భాజపాకు సరిపడా సంఖ్యాబలం లేకపోయినా.. రాజ్యసభ స్థానానికి మూడో అభ్యర్థిని పోటీకి పెట్టారు. ఇప్పటి వరకు భాజపా ఓటు చోరీ మాత్రమే చేసింది.. ఇప్పుడు సీట్ చోరీ కూడా మొదలుపెట్టింది. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎక్కడైనా తెలంగాణకు అనుకూలంగా మాట్లాడినట్లు నిరూపించాలి. ఎవరి వద్ద వ్యతిరేకంగా మాట్లాడారో వాళ్లే నాకు చెప్పారు. పోలవరం కోసం 4 మండలాలను ఏపీలో కలిపారు. అదేరీతిలో తెలంగాణ కోసం మహారాష్ట్ర నుంచి 1500 ఎకరాలు సాధించలేరా?మహారాష్ట్రను ఒప్పించే వరకు క్యాబినెట్ సమావేశానికి రానని కిషన్‌రెడ్డి, రాజీనామా చేస్తామని 8 మంది భాజపా ఎంపీలు చెప్పలేరా?ఆ పార్టీ ఎంపీలు గట్టిగా అడిగితే రాష్ట్రానికి నిధులు వస్తాయి కదా! రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్)ను కూడా కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారు. కేటీఆర్ చెప్పినట్లు కిషన్‌రెడ్డి డ్రామా ఆడుతున్నారు.

### హిట్లర్ ఆదర్శమని ఎప్పుడూ చెప్పలేదు

తెలంగాణకు వచ్చివెళ్లేందుకు.. పోటీ చేసేందుకు పవన్‌కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉంది. ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే పవన్ విషయంలో మా మంత్రులు స్పందించారు. శాంతిభద్రతల కారణంతోనే ఆయన సభకు అనుమతి ఇవ్వలేదు. ఏపీలో చాలాసార్లు జగన్ సభలకు అనుమతి ఇవ్వలేదు. ఎందుకు అనుమతి ఇవ్వలేదో పవన్‌కల్యాణ్ చెప్పాలి.



ప్రధాని మోదీనే నన్ను కౌగిలించుకున్నారు.. నేను కాదు. హిట్లర్ నాకు ఆదర్శమని నేనెప్పుడూ చెప్పలేదు. ప్రజాస్వామ్యంలో ఉన్నవాళ్లు ఎవరైనా హిట్లర్ ఆదర్శమని అంటారా?మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం వద్ద చర్చ జరగలేదు” అని రేవంత్‌రెడ్డి తెలిపారు.



## వామ్మో.. లేడీ డాన్

### మోస్ట్ వాంటెడ్ గంజాయి రాణి

- ఈగల్ టీం, ఎక్సైజ్, పోలీస్ శాఖ వారిని ముప్పు తిప్పలు పెడుతున్న కిలేడీ
- వామ్మో.. సినిమాను మించిన ‘లేడీ డాన్’ కాలాపతి నీతూబాయి క్రైమ్ స్టోరీ!

ఒకటా.. రెండా.. ఏకంగా 20 కేసులు! ఒకసారి దొరికితే బ్యాంక్ అకౌంట్లలో రూ. 1.53 కోట్ల క్యాష్.. ఇంకోసారి దొరికితే రూ. 34.40 లక్షల నగదు.. చేతిలో రూ. 2 కోట్ల ఆస్తులు! ఇదంతా ఏదో క్రైమ్ థ్రిల్లర్ సినిమా స్టోరీ అనుకుంటే పొరపాటే.. హైదరాబాద్ ఐటీ కారిడార్‌ను వణికిస్తున్న ఒకే ఒక్క మహిళా గంజాయి డాన్ అసలు సిసలు హిస్టరీ! ....

2 లో..




## చేనేత కార్మికులకు అండగా ఉంటా

- సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా
- నేతన్నల నిరసన విరమింపజేసిన రాష్ట్ర మంత్రి కొండా సురేఖ

**వరంగల్, ఆయుధం:** చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి న్యాయమైన డిమాండ్లను తెలుసుకుని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని మంత్రి సురేఖ హామీ ఇచ్చారు. చేనేత రంగంపై ఆధారపడిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందనే భరోసా మంత్రి కొండా సురేఖ కల్పించారు. టెండరు విధానం రద్దు చేసి, టెస్కో ద్వారానే నేరుగా కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేస్తూ కార్మికులు కొత్తవాడలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద చేనేత సహకార సంఘాల కార్మికులు చేపట్టిన శాంతియుత నిరసన శిబిరం వద్దకు చేరుకున్నారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, చేనేత కార్మికుల కు హామీ ఇచ్చారు. 2,29,000 వేల పేసులు వెంటనే ఖరీదులు ప్రభుత్వం చేస్తుందని, 30 శాతం నేత కూలీ పెంచి ఖరీదులు చేస్తుందని మాట ఇచ్చారు. వారం రోజుల్లో మంత్రుల బృందం కలిసి ముఖ్యమంత్రి తో కలిసి మాట్లాడి వరంగల్ చేనేత కార్మికుల



న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తామని అధికారికంగా ప్రకటించి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రి హామీతో సంతృప్తి చెందిన కార్మికులు రేపటి నుండి నిరసన దీక్ష విరమిస్తున్నామని ప్రకటించారు. కార్మికుల దగ్గరికి కదలివచ్చి హామీ ఇచ్చిన మంత్రి కి చిప్ప వెంకటేశ్వర్లు, పలువురు నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిగొప్పుల సంపత్, ఎలుగం వెంకటమల్లు, సాంబయ్య, పంతగాని శ్రీనివాస్, దువ్వల రవి, కూరపాటి సంపత్, దాసరి రాజశేఖర్, దామెర రాజ్ కమల్, గొండ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



## పట్టాల పంపిణీతో భావితరాలకు..
# శాశ్వత భూ హక్కులు

- ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం
- ప్రత్యేక ప్రజా దర్బార్ ద్వారా గ్రామాలకే ప్రభుత్వ సేవలు
- భూమి,ఇండ్ల, పెన్షన్లు, సాగునీటి సమస్యలకు వేగవంత పరిష్కారం
- రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క

ములుగు, ఆయుధం: రామచంద్రపూర్ భూములకు పట్టాల పంపిణీ ద్వారా భావి తరాలకు శాశ్వత భూ హక్కులు కల్పించనున్నామని, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వేగంగా పరిష్కరించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడానికే ప్రత్యేకంగా ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు.

99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం ములుగు జిల్లా




మల్లంపల్లి మండలం రామచంద్రపూర్ గ్రామంలోని రైతు వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమంలో మల్లంపల్లి మండలంలోని గిత్తూర్ తండా, కొడిశాలకుంట, ముద్దునూరు తండా, రామచంద్రపూర్, భూపాల్‌నగర్, శివతండ గ్రామపంచాయతీల పరిధిలోని ప్రజల నుంచి మంత్రి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావుతో కలిసి దరఖాస్తులను స్వీకరించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ప్రజలకు న్యాయం చేసే దిశగా ప్రజా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ప్రత్యేకంగా రామచంద్రపూర్ గ్రామ పరిధిలో సుమారు 10,600 ఎకరాల భూములకు సంబంధించిన 30 నుంచి 40 సంవత్సరాలుగా కొనసాగుతున్న సమస్యలను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించి, రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా రైతులకు పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు.

భూముల సమస్యల పరిష్కారంతో పాటు రైతులకు పూర్తి స్థాయిలో వ్యవసాయ భరోసా కల్పించేందుకు రెండు పంటలకు సమృద్ధిగా సాగునీరు అందించే ప్రత్యేక ప్రణాళికలను ప్రభుత్వం రూపొందిస్తోందని, రైతులు ఆర్థికంగా బలోపేతం కావడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

ఇళ్లులేని నిరుపేదలకు గౌరవప్రదమైన జీవనం కల్పించేందుకు మొదటి విడతలో ములుగు నియోజకవర్గానికి 5 వేలకుపైగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని, రెండో విడతలో అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్లు అందించేలా కార్యాచరణ కొనసాగుతోందన్నారు. ప్రజా దర్బార్ కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ త్వరితగతిన పరిష్కార చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. సామాజిక భద్రతలో భాగంగా అర్హులైన వారికి త్వరలోనే నూతన పెన్షన్లు మంజూరు చేసి ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ



## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

- పారిశ్రామిక ప్రదేశాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి
- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హనుమకొండ, ఆయుధం:** బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలని కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పిలుపునిచ్చారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినం నేపథ్యంలో శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన గోడ ప్రతులను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హనుమకొండ, కాజీపేట పరిధిలోని పారిశ్రామిక ప్రాంతాల్లో, షాపుల్లో, ప్రమాదకర ప్రాంతాల్లో కార్మిక శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ పోలీసు యూనిట్, చైల్డ్ హెల్ప్ లైన్, స్వచ్ఛంద సంస్థల సహకారంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. 14 ఏళ్లలోపు బాల బాలికలు పని చేస్తున్నట్లు గుర్తిస్తే బాల కార్మిక నిర్మూలన చట్టం ప్రకారం సంబంధిత యాజమానులపై చట్ట ప్రకారం కేసు నమోదు చేయాలన్నారు. 18 ఏళ్లలోపు బాల బాలికలు పనిచేస్తున్నట్లు గుర్తిస్తే బాలల న్యాయ చట్టం ప్రకారం యాజమానులపై కేసులు నమోదు చేయాలన్నారు. కార్యాచరణ ప్రకారం స్పెషల్ డ్రైవ్ బృందాలకు జిల్లా బాలల పరిరక్షణ విభాగం వారు అత్యవసర పరిస్థితుల్లో

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయాలు చేయొద్దు

- టీజీపీసీబీ నోడల్ అధికారి బి. జీమూత వాహన

**హనుమకొండ, ఆయుధం:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల కార్యాచరణ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం పురస్కరించుకొని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, హనుమకొండ వారు దుకాణదారులు మరియు వ్యాపారులకు వస్త్ర సంచులు మరియు తిరిగి ఉపయోగించదగిన పాత్రల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హనుమకొండ టీజీపీసీబీ నోడల్ అధికారి బి. జీమూత వాహన, ప్లాస్టిక్ వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించి, పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాలను ఉపయోగించమని సూచించారు. పర్యావరణ అనుకూల/జీవవిచ్ఛిన్నమయ్యే ఉత్పత్తులను మరియు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లకు ప్రత్యామ్నాయాలను మాత్రమే ఉపయోగించాలని నొక్కి చెప్పారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, పలుచని ప్యాకింగ్ ఫిల్ములు, డిస్పోజబుల్ కప్పులు, ప్లేట్లు మరియు ప్లాస్టిక్ కట్లరీతో సహా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు చట్టప్రకారం ఖచ్చితంగా నిషేధించబడ్డాయని కూడా పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా.బి. రాజారెడ్డి, హనుమకొండ మున్సిపల్ ఆరోగ్య అధికారి డా.ఎం. రాజేష్, దుకాణదారులకు, వ్యాపారులకు ఒక హెచ్చరిక జారీ చేశారు. సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ల నిల్వ, పంపిణీ, అమ్మకాలకు సంబంధించి ఇది అధికారిక మరియు తుది హెచ్చరిక అని వారు తెలిపారు. స్పష్టమైన ప్రభుత్వ నిబంధనలు మరియు ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ నియమాలు ఉన్నప్పటికీ, ఎప్పటికప్పుడు జరిగే తనిఖీలలో అనేక సంస్థలు నిషేధిత ప్లాస్టిక్‌లను వినియోగదారులకు రహస్యంగా అందిస్తూనే ఉన్నాయని వెల్లడైంది. మీ సంస్థ ఏదైనా నిషేధిత సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిల్వ చేస్తున్నట్లు, విక్రయిస్తున్నట్లు లేదా ఉపయోగిస్తున్నట్లు పట్టుబడితే, మీరు భారీ ఆర్థిక జరిమానాలు, సరుకుల జప్తు, వ్యాపార లైసెన్సుల రద్దు వంటి తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుంది అన్నారు.



ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్‌లకు ప్రత్యామ్నాయాలపై ఒక చిన్న ప్రదర్శన నిర్వహించబడింది. వస్త్ర సంచులు మరియు పునర్వినియోగ కంటైనర్ల ప్రోత్సాహంపై అవగాహన కల్పిస్తూ, పాల్గొన్న వారందరికీ మరియు స్థానిక ప్రజలకు వస్త్ర సంచులను పంపిణీ చేయడం జరిగింది. ఈ అవగాహన కార్యక్రమంలో సుమారు 100 మంది దుకాణదారులు, వ్యాపారులు, మున్సిపల్ సిబ్బంది చురుకుగా పాల్గొన్నారు.




## ఎస్ఐఆర్‌లో బీఎల్ఏలు చురుకైన పాత్ర పోషించాలి

- టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్

**ఖమ్మం, ఆయుధం:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో బీఎల్ఏలు చురుకైన పాత్ర పోషించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి, బీఎల్ఏ శిక్షణ సమన్వయ కర్త బండి సుధాకర్ గౌడ్ పేర్కొన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా టీపీసీసీ రాష్ట్రవ్యాప్తంగా అసెంబ్లీ వారీగా బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏలు) శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన బీఎల్ఏల శిక్షణ కార్యక్రమం ఖమ్మంలో జరుగగా.. బండి సుధాకర్ గౌడ్ హాజరై బీఎల్ఏలకు శిక్షణ అందించారు. ఈ సందర్భంగా బండి సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఓటరు జాబితాలను పారదర్శకంగా, ఖచ్చితంగా నవీకరించిన విధంగా ఉంచేందుకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. బీఎల్ఏలు బూత్ లెవల్ అధికారులతో (బీఎల్ఓలు) సమన్వయం చేసుకుంటూ కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఓటర్ల వివరాల సవరణ వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ప్రతి అర్హత కలిగిన ఓటరును గుర్తించి ఓటరు జాబితాలో నమోదు చేయడం, ఏ ఒక్క నిజమైన ఓటరు కూడా జాబితా నుంచి తొలగించకుండా చూడడం బీఎల్ఏల బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు నిబద్ధతతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఖమ్మం డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, ఖమ్మం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు దీపక్ చౌదరి, సుడా చైర్మన్ దుర్గాప్రసాద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన బీఎల్ఏలు పాల్గొన్నారు.




## ఫీజుల దోపిడీని అరికట్టాలి

- ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షులు తక్కలపల్లి శ్రీనివాసరావు

## పట్టాల పంపిణీతో భావితరాలకు..
# శాశ్వత భూ హక్కులు

(మొదటి పేజీ తరువాయి..)
సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. మహిళా సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని, మహిళా సంఘాలకు విశిష్ట గౌరవం కల్పిస్తూ రాష్ట్రవ్యాప్తంగా రూ.61 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను అందించామని తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి రంగంలో మరింతగా ఎదగడానికి రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న గోదాములు మహిళా సంఘాల వీవో భవనాల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. నూతన అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ భవనాలు, ఇతర మౌలిక వసతుల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలు సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా ప్రభుత్వమే గ్రామాలకు వెళ్లి సమస్యలను స్వీకరించి అక్కడికక్కడే పరిష్కారం చూపించే విధానాన్ని అమలు చేస్తున్నామని, ప్రతి దరఖాస్తును బాధ్యతగా తీసుకుని సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని మంత్రి స్పష్టం చేశారు.

అంతకుముందు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మల్లంపల్లి మండలం రామచంద్రపూర్ గ్రామ పరిధిలోని యేసునగర్‌లో సీఆర్ఆర్ 202526 నిధులతో రూ.19 లక్షల వ్యయంతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డును, ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి దుర్గామాత ఆలయం వరకు రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, అలాగే డీఎంఎఫ్‌టీ నిధులతో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన దుర్గామాత దేవాలయ కాంపౌండ్ వాల్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం కోయగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా కలెక్టర్‌తో కలిసి మెగా శానిటేషన్ డ్రైవ్‌లో పాల్గొన్నారు.

"అమ్మ మాట - అంగన్‌వాడి బాట అంగన్‌వాడీలో పిల్లలను నమోదు చేయండి, వారి భవిష్యత్తుకు పునాది వేయండి" అనే నినాదంతో ములుగు ప్రాజెక్టు మల్లంపల్లి సెక్టార్ రామచంద్రపూర్ యేసునగర్‌లో నిర్వహించిన అవగాహన ర్యాలీలో మంత్రి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్‌తో కలిసి పాల్గొన్నారు. రామచంద్రపూర్ ప్రజా దర్బార్ కార్యక్రమం అనంతరం మంత్రి అనసూయ సీతక్క అంగన్‌వాడీ పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ వికాస్ మీనా, అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జీ, ఎం. సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మెన్ బొక్క సత్తిరెడ్డి, ప్రజాప్రతినిధులు, గ్రామాల సర్పంచులు, తహసీల్దార్, ఎంపీడీఓ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# 14న కాకతీయుల కోటలో కళా వైభవం


- వేయి మందితో నృత్యం
- కాకతీయ మహా సంగీత & నృత్య కళా వైభవంను విజయవంతం చేయండి

**హనుమకొండ, ఆయుధం:** ఈనెల 14న ఆదివారం సాయంత్రం 3గం. ల వరంగల్ కోటలోని ఖుష్ మహల్ ప్రక్కన గల గ్రౌండ్ లో అంజలి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో తెలంగాణ బాషా సాంస్కృతిక శాఖా పర్యాటక, శాఖా కూడా వారి సహకారంతో తెలంగాలో మొట్ట మొదటి సారిగా శాస్త్రీయ నృత్య బృంద ప్రదర్శన వందలాది నృత్యకారిణులతో ఆరు నిముషాలపాటు కాకతీయుల వైభవం పై తయారుచేసిన పాటపై శాస్త్రీయ నృత్యోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం వారు హనుమకొండ గ్రేటర్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. నృత్యకారులందరూ ఒకేమారు ఒకే తీరు నృత్యం చేసి కాకతీయ బుక్ ఆఫ్ రికార్డ్ నెలకొల్పనున్నారు. సామూహిక, నాదార్చన కళావైభవం కూడా ఉంది. ఇందులో గాయకులందరూ ఒకే స్వరంలో భక్త రామాదాసు కీర్తనలను పాడనున్నారు. కాకతీయ కళావైభవం అంతరించిపోతున్న కళలు సంస్కృతులను మావి తరాలకు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

అంజలి మీడియా గ్రూపు ఆధ్వర్యంలో వరంగల్ కోటలోని ఖుష్ మహల్ ప్రాంగణంలో జరుగనున్న కార్యక్రమానికి మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, ప్రముఖ తెలుగు నటుడు సుమన్ సినీ సంగీత దర్శకులు ఏం.ఎల్.రాజా తదితరులు విచ్చేయనున్నారు. చరిత్రాత్మక కార్యక్రమానికి ప్రతిఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో అంజలి మీడియా గ్రూప్ చైర్మన్ కామిశెట్టి రాజు పటేల్ ఉపాధ్యక్షులు ఏం.డి. సిరాజుద్దీన్, కరస్పాండెంట్ రంజిత్ కుమార్, సాంస్కృతిక శాఖా కన్వీనర్ ఎస్.కే.బాబర్, సంసిద్ధాదిపతి బిటవరం శ్రీమన్నారాయణ, అంజలి మీడియా గ్రూప్ సలహా మండలి సభ్యులు ప్రొఫెసర్ గూడా నరసింహ మూర్తి, ప్రొఫెసర్ విజయ్ బాబు, పగడాల సరళ, విప్రనపల్లి రవికుమార్, వాసిరెడ్డి కృష్ణారావు, రహమాన్, తదితరులు పాల్గొన్నారు.

## జనగామ జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిగా
# డాక్టర్ వస్కుల శ్రీనివాస్

**జనగామ, ఆయుధం:** కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని జనగామ జిల్లా జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారిగా డాక్టర్ వస్కుల శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు కాకతీయ విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ ఉత్తర్వులు జారీ చేస్తూ, నియామక పత్రాన్ని అందజేశారు. డాక్టర్ వస్కుల శ్రీనివాస్ ప్రస్తుతం జనగామ ధర్మకంచలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కామర్స్ జూనియర్ లెక్చరర్‌గా, తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్475 రాష్ట్ర అధ్యక్షులుగా అలాగే కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. వారి సేవలను గుర్తించి విశ్వవిద్యాలయం ఈ నూతన బాధ్యతలను అప్పగించింది. ఈ అవకాశం కల్పించినందుకు కాకతీయ విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ కు డాక్టర్ శ్రీనివాస్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



జిల్లా ప్రోగ్రాం అధికారిగా నియమితులైన డాక్టర్ వస్కుల శ్రీనివాస్‌ను వివిధ కళాశాలల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ (TGJLA475) సంఘ నాయకులు, కళాశాల ప్రిన్సిపాల్ నాముని పావని కుమారి, NSS యూనిట్ 2 ప్రోగ్రామ్ ఆఫీసర్ మరిపల్ల రవిప్రసాద్, సహచర అధ్యాపకులు ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు.

# బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషిచేయాలి

(మొదటి పేజీ తరువాయి..)
వినియోగించే వాహనాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ సంవత్సరము బాల కార్మిక వ్యతిరేక దినం సందర్భంగా నిర్వహించే క్యాంపెయిన్ అంశం న్యాయమైన బాల్యం బాలలకు, గౌరవప్రదమైన ఉపాధి పెద్దలకు అనేది దృష్టిలో ఉంచుకొని ఏ రంగంలో కూడా బాల కార్మికులు ఉండకూడదని కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో బాల కార్మిక రహిత జిల్లా ఏర్పాటుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఎన్సీఎల్పీ డైరెక్టర్ బుర్ర అశోక్, బాలల సంక్షేమ సమితి సభ్యులు డాక్టర్ పరికి సుధాకర్, బాలల పరిరక్షణ విభాగం ఇంచార్జి అధికారి ఎస్. ప్రవీణ్ కుమార్, ఎఫ్ఎంఎం ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎర్ర శ్రీకాంత్, ప్రోగ్రాం మేనేజర్ కరుణ, ప్రొటెక్షన్ ఆఫీసర్ మౌనిక,చైల్డ్ హెల్ప్ లైన్ కో ఆర్డినేటర్ భాస్కర్, ఓఆర్ డబ్ల్యు విజయ్ కుమార్, సీత పాల్గొన్నారు.

### గురుకుల విద్యార్థిని అభినందించిన కలెక్టర్

సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల (గొలిదొడ్డి)లో ఇంటర్మీడియట్ విద్యలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యి ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్ లో ఐఐటీ లో సీట్ సాధించిన పెరుమాండ్ల మనస్విత్ ను కలెక్టర్ చాహత్ బాజ్ పాయి కలెక్టరేట్ లో అభినందించారు,

- ఈగల్ టీం, ఎక్సైజ్, పోలీస్ శాఖ వారిని ముప్పు తిప్పలు పెడుతున్న కిలేడీ
- సినిమాను మించిన 'లేడీ డాన్' కాలాపతి నీతూబాయి క్రైమ్ స్టోరీ!

# వామ్మో.. లేడీ డాన్
## మోస్ట్ వాంటెడ్ గంజాయి రాణి



**ఒకటా.. రెండా.. ఏకంగా 20 కేసులు! ఒకసారి దొరికితే బ్యాంక్ అకౌంట్లలో రూ. 1.53 కోట్ల క్యాష్.. ఇంకోసారి దొరికితే రూ. 34.40 లక్షల నగదు.. చేతిలో రూ. 2 కోట్ల ఆస్తులు! ఇదంతా ఏదో క్రైమ్ థ్రిల్లర్ సినిమా స్టోరీ అనుకుంటే పొరపాటే.. హైదరాబాద్ ఐటీ కారిడార్‌ను వణికిస్తున్న ఒకే ఒక్క మహిళా గంజాయి డాన్ అసలు సిసలు హిస్టరీ!**

ఈమె పేరే కాలాపతి నీతూబాయి(48). తెలంగాణ ఈగల్ టీమ్, ఎక్సైజ్ శాఖ, హైదరాబాద్ పోలీస్.. ఇలా ముగ్గురిని ముప్పు తిప్పలు పెడుతూ మోస్ట్ వాంటెడ్‌గా మారిన 'గంజాయి రాణి'. ధూల్‌పేటకు చెందిన నీతూబాయి.. నానక్‌రాంగూడలోని లోథాబస్తీని తన అడ్డాగా మార్చుకుంది. బయటకి చూస్తే సాదాసీదా కిరాణా దుకాణం.. కానీ లోపల జరిగేది మాత్రం రోజుకు లక్షల రూపాయల గంజాయి బిజినెస్! ఐటీ కారిడార్‌లోని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే లక్ష్యంగా ఈమె నెట్‌వర్క్ సాగుతోంది. దాదాపు పదేళ్లుగా ఫ్యామిలీ మొత్తాన్ని రంగంలోకి దించి ఈ స్మగ్లింగ్ సామ్రాజ్యాన్ని నడుపుతోంది.

....

గతంలో పోలీసులు ఈమెపై పీడీ యాక్ట్ పెట్టి జైలుకు పంపారు. ఆస్తులన్నీ సీజ్ చేశారు. కానీ, జైలు నుంచి బయటకొచ్చాక మైండ్ గేమ్ మార్చేసింది. దాదాపు ఏడాదిగా అజ్ఞాతంలో ఉంటూ.. ఎవరికీ చిక్కకుండా అండర్‌గ్రౌండ్ నుంచే పక్కా స్కెచ్‌తో అనుచరుల ద్వారా దందా నడిపిస్తోంది.

బుధవారం నానక్‌రామ్‌గూడలోని ఆమె నివాసంపై తెలంగాణ ఈగల్ ఫోర్స్ బృందాలు మెరుపు దాడి చేశాయి. తీరా చూస్తే అక్కడ గంజాయి కొనేందుకు క్యూ కట్టిన 47 మంది యువకులు పోలీసులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయారు! ఆమె ఇంట్లో రూ.2.60 లక్షల నగదు దొరికింది. కానీ, నీతూబాయి.. పోలీసుల కళ్లు గప్పి చాకచక్యంగా ఎస్కేప్ అయిపోయింది! పట్టుకోవాలని పోలీసులు.. దొరకకుండా తప్పించుకోవాలని లేడీ డాన్.. ప్రస్తుతం ఐటీ హబ్‌లో ఈ 'క్యాట్ అండ్ మౌస్' గేమ్ పీక్స్‌కి చేరింది.

# ప్రజా పాలనలో గ్రామాలు అభివృద్ధి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి
- పలు గ్రామాల్లో సిసి రోడ్, సైడ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

**ఆత్మకూరు, ఆయుధం:** గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణ యందు ఆత్మకూర్, గుడేప్పాడ్, అక్కంపేట, కటాక్షపూర్, కొత్త గట్టు, మల్కపేట, అగ్రం పహాడ్, నీరుకుల్లా, పెంచికలపేట, చౌలపల్లి, లింగమడుగు పల్లి, నాగయ్య పల్లి గ్రామాలకు చెందిన సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే పెద్దాపురం గ్రామానికి మంజూరైన తెలంగాణ పబ్లిక్ స్కూల్ కి కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నాం అని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు.



మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత రవాణా సౌకర్యాన్ని కల్పిస్తూనే, మరోవైపు ఆర్టీసీ సంస్థకు సైతం మంచి ఆర్థిక బలాన్ని చేకూరుస్తోంది అని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలకుల చేతుల్లో గ్రామాల్లో అభివృద్ధి నిరాదరణకు, నిర్లక్ష్యానికి గురైన గ్రామాలు నేడు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలనలో వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు తీసుకురావడంతోపాటు, గ్రామాలలో మౌలిక వసతులను అభివృద్ధి పరచడం కోసం, అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలందరి సహకారంతో నియోజకవర్గంలోని గ్రామాలు మరింత అభివృద్ధి అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామన్నారు. గ్రామాల్లోని సిసిరోడ్లు, సైడ్ డ్రైనేజ్ పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అలాగే కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇటీవల పెద్దాపూర్ గ్రామానికి మంజూరైన తెలంగాణ పబ్లిక్ స్కూల్ కి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి చర్యలు శంకుస్థాపన చేశారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ స్కూల్ పేరిట ప్రత్యేక మోడల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తోంది అన్నారు. గురుకుల పాఠశాల విద్యార్థులకు డైట్ చార్జెస్ పెంచామన్నారు.

### అంగన్వాడి భవనం ప్రారంభం



ఆత్మకూరు, ఆయుధం: ఆత్మకూరు మండల కేంద్రంలో నిర్మించిన అంగన్వాడి భవనాన్ని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్న ప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది అంగన్వాడీలని, గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, బాలల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. ప్రీ ప్రైమరీ స్కూల్ లు ఏర్పాటు చేయబోతున్నామని, డైట్ చార్జెస్ పెంపు, అత్యాధునిక విద్యా ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అంగన్వాడి కేంద్రాలు చిన్నారుల విద్యాభివృద్ధికి, గర్భిణీలు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు ఎంతో కీలకమని తెలిపారు. పిల్లలకు పోషకాహారం, ప్రాథమిక విద్య, ఆరోగ్య సేవలు అందించే దిశగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

- ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి
- ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్టపరచాలి.
- ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షులు తక్కలపల్లి శ్రీనివాసరావు





**హనుమకొండ, ఆయుధం:** అఖిల భారత విద్యార్థి సమైక్య (ఏఐఎస్ఎఫ్) హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో బాలసముద్రంలోని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్ అధ్యక్షతన విద్యార్థి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రైవేట్ విద్యాసంస్థల్లో కొనసాగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టడం, ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడం, ప్రభుత్వ విద్యారంగ సమస్యలను పరిష్కరించి విద్యను బలోపేతం చేయడం వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షులు కామ్రేడ్ తక్కలపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్య అనేది ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని, దానిని వ్యాపార వస్తువుగా మార్చే విధానాలను తీవ్రంగా వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, విద్యార్థుల హక్కుల సాధన కోసం విద్యార్థి నాయకులు నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను 7,000 నుండి 4,000కు కుదించే ఆలోచనపై చేసిన వ్యాఖ్యలు ఆందోళనకరమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన సమయంలో వాటి సంఖ్యను తగ్గించే సంకేతాలు ఇవ్వడం విద్యా హక్కును బలహీనపరిచే చర్యగా ప్రజలు భావించే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం ఈ వ్యాఖ్యలపై స్పష్టత ఇవ్వాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని మరింత బలోపేతం చేసే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని గురుకుల విద్యాసంస్థలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. అనేక హాస్టళ్లు శిథిలావస్థలో కొనసాగుతున్నాయని, విద్యార్థులు తాగునీరు, పారిశుధ్యం, భద్రత, వసతి వంటి కనీస సౌకర్యాలకు కూడా నోచుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను లాభదాయక వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులపై భారీ ఆర్థిక భారాన్ని మోపుతున్నాయని విమర్శించారు. తమిళనాడు రాష్ట్రంలో అమలులో ఉన్నట్లుగా పారదర్శకమైన, ఏకీకృత ఫీజు నియంత్రణ విధానాన్ని తెలంగాణలో కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అనుమతులు, ప్రమాణాలు లేకుండా పుట్టగొడుగుల్లా వెలుస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యా ప్రమాణాలను ఉల్లంఘించే సంస్థల గుర్తింపులను రద్దు చేయాలని కోరారు. విద్యారంగంలో పెరుగుతున్న ప్రైవేటీకరణ, వాణిజ్యీకరణ ధోరణులు సామాన్య, మధ్యతరగతి కుటుంబాల విద్యా అవకాశాలను దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

శుక్రవారం నిర్వహించిన విద్యార్థి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో ఏఐఎస్ఎఫ్, పీడీఎస్ యూ ,టీఆర్ఎస్వీ, పిడిఎస్ యు,ఏఐఎఫ్డీఎస్, పిడిఎస్ యు, యూఎస్ఎఫ్ఐ, ఏబీఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, డీఎస్ఏ, ఎస్ఎస్ఎఫ్ తదితర మొత్తం 11 మంది విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు భాషబోయిన సంతోష్, రాచకొండ రంజిత్, బైరిపాక నరేష్, మాస్ సావిత్రి, మర్రి మహేష్, మంద నరేష్, రాజేష్ నాయక్, బొట్ల మనోహర్, కామ్రేడ్ శివ, చార్వాక, నరేష్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఉట్కూరు ప్రణీత్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు, శ్రీపతి వినయ్, బొజ్జు జ్యోతి, జక్కుల భాను ప్రసాద్, అజయ్ లతోపాటు తదితర విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత

- ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి

**వరంగల్, ఆయుధం:** ప్రభుత్వ విద్యా రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం, విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరంపై చర్చించేందుకు ఏఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి AISF వరంగల్ జిల్లా అధ్యక్షుడు దిడ్డి పార్థసారథి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో AISF, AIYF, PDSU, బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొని విద్యా రంగంలోని వివిధ సమస్యలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన AISF మాజీ జాతీయ అధ్యక్షుడు, AIYF తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతుల కొరత కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రభుత్వ విద్యాసంస్థలకు అవసరమైన భవనాలు, తాగునీరు, మరుగుదొడ్లు, ల్యాబ్‌లు, గ్రంథాలయాలు మరియు డిజిటల్ సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థులు, తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని విమర్శించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్య అనేది ప్రతి ఒక్కరికీ రాజ్యాంగబద్ధమైన హక్కు అని, దానిని వ్యాపార వస్తువుగా మార్చే విధానాలను అరికట్టాలని అన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో AISF జిల్లా కార్యదర్శి శరత్, PDSU నాయకుడు అర్జున్, AIYF జిల్లా కార్యదర్శి మస్కా షుదీర్, బీసీ సంఘం నాయకుడు ప్రభాకర్ తదితరులు పాల్గొని విద్యా రంగ సమస్యలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అనంతరం విద్యా రంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ తీర్మానం ఆమోదించారు.




# ఎల్‌నినోపై వాతావరణ విభాగం హెచ్చరిక

**జాతీయం, ఆయుధం:** ఎల్‌నినోపై భారత వాతావరణ విభాగం ప్రజలకు హెచ్చరికలు జారీ చేసింది. భూమధ్య రేఖ ప్రాంతంలో పసిఫిక్ మహాసముద్ర ఉపరితలంపై ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపింది. ఈ రుతుపవనాల సీజన్‌లో ఇది మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని.. పర్యావరణంపై ప్రతికూల ప్రభావం చూపనుందని హెచ్చరించింది. దేశంలో రుతుపవనాలపై ఎల్‌నినో ప్రతికూల ప్రభావం ఉంటుందని పేర్కొంది. అత్యధిక వర్షపాతం నమోదయ్యే నైరుతి రుతుపవనాల్లో ఈసారి వర్షపాతం తగ్గుతుందని అంచనా వేసింది.

భూమధ్య రేఖ ప్రాంతంలో పసిఫిక్ మహాసముద్ర ఉపరితల జలాలు సాధారణం కన్నా ఎక్కువగా వేడెక్కడాన్ని ఎల్‌నినోగా అభివర్ణిస్తారు. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పోకడలు తారుమారవుతాయి. చివరిగా ఎల్‌నినో ప్రభావం 2023లో ఏర్పడింది. ఆ సమయంలో దేశవ్యాప్తంగా రుతుపవనాల అంతరాయం, వర్షపాతంలో వైవిధ్యం వంటి పరిస్థితులు తలెత్తాయి.



# స్మార్ట్‌ఫోన్ ధరలు ఇంకా పెరుగుతాయ్!

**బిజినెస్, ఆయుధం:** స్మార్ట్‌ఫోన్ ధరలపై మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు నథింగ్ కంపెనీ సీఈఓ కార్ల్ పై. రాబోయే రోజుల్లో స్మార్ట్‌ఫోన్ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగం నుంచి మెమొరీ చిప్‌లకు డిమాండ్ విపరీతంగా పెరగడమే దీనికి కారణమని ఆయన పేర్కొన్నారు. అందువల్ల రాబోయే పండుగల సీజన్‌లో స్మార్ట్‌ఫోన్ ధరలు తగ్గుతాయని ఆశ పడొద్దని వినియోగదారులకు సూచించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఆయన పోస్టులు పెట్టారు. గతంలో కంటే మెమొరీ చిప్‌ల ధరలు ఏకంగా 300 శాతం వరకు పెరిగాయని కార్ల్ పై పేర్కొన్నారు. ఒక స్మార్ట్‌ఫోన్ తయారీలో ప్రాసెసర్, డిస్‌ప్లే కంటే మెమొరీ అత్యంత ఖరీదైన భాగంగా మారిందని తెలిపారు. కొన్ని ప్రీమియం ఫోన్లలో మొత్తం హార్డ్‌వేర్ ఖర్చులో మెమొరీ వాటానే 50 శాతానికి పైగా ఉంటోందన్నారు. రాబోయే పండగ సీజన్ లేదా సేల్స్ సమయంలో స్మార్ట్‌ఫోన్లపై గతంలో మాదిరిగా భారీ డిస్కౌంట్లు లభించకపోవచ్చని అభిప్రాయపడ్డారు. ఫోన్ కొనాలనుకునే వారు ఆలస్యం చేస్తే మరింత ఎక్కువ ధర చెల్లించాల్సి రావొచ్చని పేర్కొన్నారు.

### రెండే ఆప్షన్లు..

మెమొరీ ఖర్చుల పెరుగుదల వల్ల మొబైల్ బ్రాండ్లు తమ లాభాలను కాపాడుకోవడానికి ఫోన్ ధరలను 30 శాతం వరకు పెంచడం లేదా ఫోన్ స్పెసిఫికేషన్లను తగ్గించడం వంటి రెండు ఆప్షన్లలో ఒకదాన్ని ఎంచుకోవాల్సి వస్తుందని కార్ల్ పై అభిప్రాయపడ్డారు. నథింగ్ కూడా దీనికి మినహాయింపు ఏమీ కాదన్నారు. తమ నథింగ్ 4ఏ అభివృద్ధి దశకు, విడుదల సమయానికి మెమొరీ ఖర్చులు రెట్టింపయ్యాయన్నారు. తమ స్మార్ట్‌ఫోన్‌ను అప్‌గ్రేడ్ చేయడమా?మరికొంతకాలం కొనుగోలును వాయిదా వేయడమా? అనేది వినియోగదారుల ముందున్న మార్గాలని పేర్కొన్నారు. కార్ల్‌పై ఇప్పుడే కాదు.. గతంలోనూ స్మార్ట్‌ఫోన్ ధరలు పెరగబోతున్నాయని సంకేతాలివ్వగా అది మార్కెట్‌లో ప్రతిఫలించింది. ఆయన తాజా వ్యాఖ్యలను బట్టి చూస్తే వచ్చే ఏడాది సైతం ఇదే ధోరణి కొనసాగే అవకాశం కనిపిస్తోంది.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695